# దేవుని 7000 సం॥ల ప్రణాళిక

గలిలయలోని కానా అనే ఊరిలో ఒక వివాహం జరిగింది. ఆ వివాహానికి యషువా (యేసు)ను ఆయన శిష్యులను ఆహ్వానించారు. యషువా తల్లి కూడా అక్కడ ఉంది. ఇక్కడ యషువా ఆ వివాహానికి హాజరవటమనేది యాదృచ్ఛికంగా జరిగినది కాదు. ఒక ప్రణాళిక ప్రకారమే అక్కడకు వెళ్ళడం జరిగింది. అది దేవుని 7000 సం॥ల ప్రణాళికను గూర్చి తెలియచెప్పడంలో భాగంగానే అక్కడకు వెళ్ళడం జరిగింది. అక్కడ ద్రాక్షారసం అయిపోవడం, మరలా ఈయన మంచి ద్రాక్షారసాన్ని తయారు చేయడం ఇదంతా కూడా ఆ ప్రణాళికలో భాగమే. ఈ సన్నివేశంలో నీళ్ళను ద్రాక్షారసంగా మార్చడం అనే సూచక క్రియ కంటే మరి ముఖ్యమైన ఘట్టం అసలు ఆయన ఆ వివాహానికి వెళ్ళిన రోజు. ఆయన వెళ్ళిన రోజుకి అత్యంత ప్రాముఖ్యత ఉంది.

**'మూడవ దినమున గలిలయలోని కానా అను ఊరిలో ఒక వివాహము జరిగెను. యేసు తల్లి అక్కడ ఉండెను. యేసును ఆయన శిష్యులును ఆ వివాహ మునకు పిలువబడిరి".** (యోహా. 2:1-2)

**3వ దినమున ఆయన కానా వివాహానికి వెళ్ళాడు. ఎప్పటినుండి 3వ దినం ?**

**'నీవెవడవని అడుగుటకు యూదులు యెరూషలేము నుండి యాజకులను, లేవీయులను యోహాను నొద్దకు పంపినప్పుడు అతడిచ్చిన సాక్ష్యమిదే" (యోహా.1:19)** అది మొదటి రోజు. ఈ బాప్తీస్మమిచ్చు యోహాను ఎవరని తెలుసుకోవడానికి యూదులు అతని దగ్గరకు యాజకులను, లేవీయులను పంపుతారు. అప్పుడు యోహాను **"ప్రభువు త్రోవ సరాళము చేయుడి"** అని అరణ్యములో ఎలుగెత్తి చెప్పు ఒకని శబ్దము అని చెప్పాడు. అంతేకాదు. **"నా వెనుక ఒకడు వచ్చుచున్నాడు"** అని యషువా మెస్సీయాను గురించి చెప్తాడు. ఇదంతా మొదటి రోజున జరిగింది. ఆ రోజున ఏదేను వనములో దేవుడు ఆదాము అవ్వలతో స్త్రీ సంతానము రాబోతుంది అని చెప్తాడు. అదే మొదటి రోజుకు సాదృశ్యము.

**రెండవ రోజు :** ఇదిగో లోక పాపములను మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల అని యోహాను యషువా మెస్సీయను గూర్చి చెప్తాడు. **(యోహా. 1:1)** యేసు ఐగుప్తులో మరణ దూతనుండి రక్షించు పస్కా గొఱ్ఱెపిల్లకు ఇది సాదృశ్యం.

మరునాడు మరల యోహానును అతని శిష్యులలో ఇద్దరును నిలుచుండగా (యోహా. 1:35) అది మూడవరోజు. శిష్యులు మేము మెస్సీయను కనుగొన్నామని చెప్తారు. అలాగే ప్రవక్తలు మెస్సీయను గూర్చి ప్రవచించారు. ఆ మరునాడు ఆయన గలిలయకు వెళ్ళగోరి ఫిలిప్పును కనుగొని నన్ను వెంబడించుమని ఆయనతో చెప్పాడు. ఇది 4వ రోజు. అంటే ప్రత్యక్షంగా యషువా మెస్సీయ తన శిష్యులను ఏర్పరచుకున్న కాలం.

ఆ మరునాడు 5వ రోజు, 6వ రోజు ఏమి జరిగిందీ ఆయన ఎక్కడున్నాడు మనకు చెప్పబడలేదు. మరల 2వ అధ్యాయం మొదటి వచనంలో మూడవ దినమున అని ఉంది. అంటే పై నాలుగు దినముల తర్వాత 3వ దినాన అంటే 7వ దినాన ఆయన కానాలోని వివాహానికి హాజరయ్యాడు. 5వ రోజు, 6వ రోజు సంగతి ఏమీలేదు. అలాగే ఆయన ఈ భూమిమీద శిష్యులను ఏర్పరచుకొని మరలా ఆయనే పెండ్లి కుమా రునిగా ఈ భూలోకానికి వచ్చేలోపు 5,6 రోజులు (రెండు రోజులు) అనగా 2వేల సంవత్సరాలు ఇక్కడలేదు. తండ్రి కుడిపార్శ్వన కూర్చుని ఉన్నాడు. 7వ దినాన తిరిగి వస్తాడు. అంటే 7వ వెయ్యి సంవత్సరాలు మొదలైనప్పుడు తిరిగి ఆ పెండ్లి కుమారునిగా తిరిగి వస్తాడు.

ఎందుకంటే దేవుని దృష్టిలో 1 దినం మనకు 1000 సం॥లు. (1పేతు. 3:8) అక్కడ 2 రోజులు (5,6 రోజులు) ఆయన కనబడలేదు. ఇక్కడ ఆయన చనిపోయి తిరిగి లేచిన తర్వాత ఆరోహణమై 2వేల సంవత్సరాలు అయినది. ఇప్పుడు ఆయన తిరిగి రావాలి. కాబట్టి ఇప్పటికి 6 రోజులు అయిపోయినవి. అంటే 6000 సం॥లు అయిపోయినవి. ఆదాము నుండి యషువా మెస్సీయ మొదటి రాకడవరకు 4వేల సంవత్సరాలు. మధ్యలో 2వేల సం॥లు ఆయన ఇక్కడ లేదు. 7వ రోజు ఆయన వివాహానికి వెళ్ళాడు. అంటే 7వ వెయ్యి సం॥లు మొదలు కాగానే ఆయన వివాహానికి తిరిగి వస్తాడు. (యోహా. 16:17)

అక్కడ ద్రాక్షారసము అయిపోయింది. అప్పుడు యషువా మెస్సీయా క్రొత్త ద్రాక్షారసాన్ని తయారు చేస్తాడు. ఎందుకంటే లూకా 22:18 ప్రకారం ఇకమీదట దేవుని రాజ్యము వచ్చువరకు నేను ద్రాక్షా రసము

త్రాగనని మీతో చెప్పుచున్నానెను. (లూకా 2:2) విందు యజమాని తయారు చేసిన ద్రాక్షారసమును త్రాగగా త్రాగగా అది అయిపోయింది. అప్పుడు యషువా వచ్చి క్రొత్త ద్రాక్షారసాన్ని తయారు చేశాడు. ఆ పాత ద్రాక్షారసానికి ఈ క్రొత్త ద్రాక్షారసానికి అసలు పోలికే లేదు. అలాగే మనం తయారుచేసికొని త్రాగుతున్న ఈ ద్రాక్షారసం త్రాగి త్రాగి అయి పోతుంది. ఆయన వివాహానికి ఆయన వస్తాడు. ఆయన శిష్యులమైన మనం కూడా ఆహ్వానింపబడతాం. అప్పుడు ఆయన తయారు చేసిన క్రొత్త ద్రాక్షారసాన్ని దేవుని రాజ్యంలో మనం త్రాగుతాము. ఇప్పుడు ఆయనను జ్ఞాపకం చేసుకోవానికి మనం త్రాగే ద్రాక్షారసానికి, ఆయన స్వయంగా తయారుచేసి మనకిచ్చే ద్రాక్షారసానికి అసలు పోలికే ఉండదు.

**అలాగే దేవుని 7వేల సం॥ల ప్రణాళికలో మరికొన్ని సాదృశ్యాలు.**

**నోవహు జల ప్రళయము :** జలప్రళయం వచ్చినప్పుడు నోవహుకు 600 సం॥లు. (ఆది. 7:6) భూమిమీద ప్రజలందరికి తీర్పు తీర్చబడింది. నోవహు అతని కుటుంబం మాత్రమే రక్షించబడింది. ఆఖరికి నోవహు యొక్క తల్లిదండ్రులు కూడా సహజ మరణం పొందిన తర్వాతే దేవుడు జలప్రళయం పంపాడు. నోవహు కుటుంబం మాత్రమే రక్షించబడింది. అలాగే 6వేల సం॥ల తర్వాత దేవుడు మహాశ్రమలను కలుగజేయబోవు చున్నాడు. జలప్రళయానికి ముందే దేవునితో కూడ నడచిన హనోకును దేవుడు తీసికొని పోయాడు. అంటే ఎత్తబడ్డాడు. అలాగే మహాశ్రమల కాలానికి ముందే ఆయనతో కూడా నడిచిన విశ్వాసులు పైకి ఎత్తబడతారు. విశ్వాసులు ఎత్తబడిన తర్వాతనే మహాశ్రమలు వస్తాయి.

**మోషే:** మోషే కొండమీదికి ఎక్కినప్పుడు ఆ మేఘము కొండను కమ్మెను. యెహోవా మహిమ సీనాయి కొండమీద నిలిచెను. మేఘము 6 దినములు దాని కమ్ముకొనెను. 7వ దినమున ఆయన ఆ మేఘములోనుండి మోషేను పిలిచినప్పుడు యెహోవా మహిమ ఆ కొండ శిఖరముమీద దహించు అగ్నివలె ఇశ్రాయేలీయుల కన్నులకు కనబడెను. అప్పుడు మోషే ఆ మేఘములో ప్రవేశించి కొండమీదికి ఎక్కెను. (నిర్గమ 24:13-18)

6 రోజుల తర్వాత 7వ రోజున దేవుడు ఆయనతోపాటు సీనాయి పర్వతముపై ఉండుటకు మోషేను మేఘములమీద కొనిపోయాడు. అదే రీతిలో 6 వేల సం॥లు అయిన తర్వాత యషువా యొక్క పెండ్లి కుమార్తె అయిన సంఘమైన మనము ఆకాశ మండలమునకు మేఘములమీద కొనిపోబడతాము. **(1థెస్స. 4:17)** కాగా సదాకాలము మనము ఆయనతో కూడా ఉంటాము. మోషే 40 పగళ్ళు 40 రాత్రిళ్ళు అక్కడే దేవునితో గడిపేస్తాడు. మనము కూడా సదాకాలం **(40 వేల సం॥?)** దేవునితో గడుపుతాము.

**యషువా మెస్సీయ శిష్యులు :** ఆరు దినములైన తరువాత యేసు పేతురును, యాకోబును అతని సహోదరుడైన యోహానును వెంటబెట్టుకొని ఎత్తయిన యొక కొండమీదికి ఏకాంతముగా పోయి వారియెదుట రూపాంతరము పొందెను. **(మత్త. 17:1)** ఆరు రోజులైన తర్వాత యషువా తన శిష్యులలో ముగ్గురిని మాత్రమే వెంటబెట్టుకొని ఎత్తయిన కొండపైకి వెళ్ళి రూపాంతరం చెందాడు. అలాగే 6వేల సం॥ల తర్వాత **(ఆదాము నుండి)** మెస్సీయ రెండవ రాకడలో క్రీస్తునందుండి మృతులైన వారు పునరుత్థానము నొందుతారు. ఆయన రెండవ రాకడ సమయంలో మోషే, ఏలియాలు కనబడతారు. కాని 12 మంది శిష్యులుంటే ముగ్గురినే తీసుకొని వెళ్లాడు. అంటే అందరికీ చాన్స్ లేదన్నమాట. కేవలం 4వ వంతుకు మాత్రమే ఆ అవకాశం దక్కింది. అంటే క్రైస్తవులమని చెప్పుకునే వారందరూ ఆదివారం చర్చికి వెళ్ళేవారందరూ ఆయన రెండవ రాకడలో ఎత్తబడరన్నమాట. అందరికీ ఆ అవకాశం లేదు. కొందరికే ఆ అవకాశం ఉంది. మిగిలిన శిష్యులు కొండ దిగువనే ఉన్నట్లుగా మిగిలిన క్రైస్తవులు కూడా భూమి మీదనే విడిచిపెట్టబడతారన్నమాట.

**లాజరును తిరిగి లేపుట :** మరియ, మార్తల సహోదరుడైన లాజరు రెండు రోజులు రోగంతో బాధపడ్డాడు. (యోహా. 11:1-6) ఆ తర్వాత చనిపోయి 4 రోజులున్నాడు. (యోహా. 11:14-39) అంటే మొత్తం 6 రోజులు. 6 రోజుల తర్వాత యషువా మెస్సీయ అతనిని తిరిగి లేపాడు. అంటే 6వేల సం॥ల తర్వాత క్రీస్తునందుండి మృతులైనవారు పునరుత్థానం పొందుతారు. మార్త ఆయనతో అంత్య దినమున పునరుత్థానమందు లేచునని నేనెరుగుదును అంటుంది. **(యోహా. 11:24)** 6వేల సం॥ల తర్వాత వచ్చే ఆ అంత్య దినానికి సాదృశ్యమైన ఈ 6వ రోజున యషువా మెస్సీయ లాజరును పునరుత్థానుడిగా చేశాడు.

**సొలొమోను సింహాసనం :** రాజైన సొలొమోను బంగారు సింహాసనానికి 6 మెట్లున్నాయి. 6 మెట్లు ఎక్కి పైకెళ్తే 7వది సింహాసనం. అదే రీతిలో 6వేల సం॥ తర్వాత 7వ వెయ్యి సం॥లను యషువా మెస్సీయ సింహా సనాన్ని అధిష్టించి భూలోకాన్ని పరిపాలిస్తాడు. (2దిన. 9:18)

బైబిలులో 7వేల సం॥ల ప్రణాళికకు సంబంధించి ఇంకా చాలా సాదృశ్యాలున్నాయి. కాబట్టి ఆదాము మొదలు యషువా మెస్సీయ మొదటి సారి ఈ లోకానికి వచ్చేవరకు 4వేల సం॥లు. 4వేల సం॥ల తర్వాత యషువా మెస్సీయ మొదటి రాకడ జరిగింది. మరలా ఆదాము దగ్గర నుండి 6వేల సం॥ల తర్వాత ఆయన రెండవ రాకడ జరుగుతుంది. 7వ వెయ్యి సం॥లలో ఆయన ఈ భూలోకాన్ని వేయ్యేళ్ళు పరిపాలిస్తాడు. మనం ఇప్పుడు 2014 సం॥లో ఉన్నాము. క్రీస్తుకు పూర్వం 4వేల సం॥లు (సుమారు) క్రీస్తు తర్వాత 2014 సం॥లు అంటే 6వేల సం॥లు దాటిపోయింది. మరి ఆయన ఇంకా రాలేదేమిటి ? రెండవ రాకడ జరిగలేదేమిటి ? అని అనుకుంటున్నాము.

ఇశ్రాయేలీయులు ఐగుప్తులో 400 సం॥లు ఉంటారు. ఆ తర్వాత నేను వచ్చి వారిని విడిపిస్తాను అని చెప్పాడు. కాని 430 సం॥ల తర్వాత వచ్చి విడిపించాడు. కొంచెం అటు, ఇటు అవ్వొచ్చు. ఇప్పుడు 6వేల సం॥లకు కొంచెం అటు ఇటు అవ్వొచ్చు. అప్పుడు 30 సం॥లు అదనంగా పట్టింది. కాబట్టి ఇప్పుడు కూడా 30 సం॥లు పడుతుంది అనుకోవడానికి కాదు. అది 14 సం॥లు కావచ్చు, 20 కావచ్చు. ఎంతైనా కావచ్చు. యూదుల లెక్క ప్రకారమైతే 6వేల సం॥లు పూర్తికావడానికి ఇంకా 24 సం॥లు ఉంది. ఇది 5,976వ సం॥.

ఇంతకీ ఏ లెక్క కరెక్ట్ మనకు ఖచ్చితంగా తెలియదు. దేవుని లెక్క ఈ లెక్కలన్నిటికి భిన్నంగా ఉందేమో. ఏది ఏమైనా గాని మనం ఆ 6వేల సం॥కి అత్యంత సమీపంలోనే ఉన్నాము. ఆయన రాకడ ఏ క్షణానైనా రావచ్చు. కొండపైకి వెళ్ళిన ముగ్గురు శిష్యులవలె ఎత్త బడతామా? లేదా మిగిలిన వారిలా విడవబడతామా ? మీరే ఆలో చించుకోండి. ఒకటి మాత్రం ఖచ్చితం. త్వరలో యషువా మెస్సీయ రెండవ రాకడ జరుగబోతుంది. మరి మీ సంగతేమిటి ?